# ఐ పి టీ యు |

మా ఆడబడుచుకూతురు తిరుమల వేంకటలక్ష్మి ప్రసన్న కుమారి(గుంట ముండకు నాలుగైదేళ్ళుంటాయి) రాత్రిళ్ళు వచ్చి అందరిపక్కల లోనూ పడి నిద్రపోయి, ఓ రాత్రివేళ ఎవరి పక్కో తడిపేసి పుణ్యం కట్టుకుంటూ వుంటుంది. దానికి "జలఉష" అని పేరెట్టాం. నెహ్రూగారికిమల్లే నాక్కూడా కొంచెం శాన్స్క్రిట్ వచ్చు, మనవాళ్ళు విమానానికి "మేఘదూత్" అని, ట్రాంబేలో అణుశక్తి కేంద్రానికి "అప్సర" అనీ, మిలిటరీ ట్రక్కుకి "శక్తిమాన్" అని పేర్లు పెట్టలా? రోడ్లపేర్లుకూడా కింగ్సువేకి రాజపథ్ అనీ, క్వీన్స్‌వేకి జనపథ్ అని మార్చారు, అందుకే నేను నెహ్రూగారితో పోటీపడి తిరుమల వేంకటలక్ష్మి ప్రసన్నకుమారికి జలఉష అని పేరెట్టా. ఉషా అంటే అది పలుకుతుంది. ప్రసన్న అంటే మాట్లాడదు.

ఇప్పుడు రైటర్సుగూడా సుబ్బారావు అనేపేరుకు బదులు సురేష్. శంకరానికి బదులు శేఖర్ యిలా హిందీ, సంస్కృత, బెంగాలీ మయమైన పేర్లను వాడుతున్నారు. సుబ్బమ్మ అనే పేరు సుజాతగా మార్చుకుంటున్నారు.

సినిమా కథలలో పాత్రలకు వెంకట్రావు, పోలుపిల్లి, సత్యనారాయణ, నరసయ్య, తలుపులు లాటి పేర్లుంటే హీరోయిన్లు యాక్టు చేయరట. అచ్చ తెలుగుపేర్లు తీసేసి రాజశేఖర్, గోపాల్, సురేష్, రాజా లాంటి పేర్లు తగిలించకపోతే ఆ కథ అడ్డం తిరుగుతుందట,

కమింగ్ టు ది పాయింట్ — కొంచెం అంగ్రేజి వచ్చినవాళ్ళవల్ల ఎక్కువ డేంజరా? కొంచెం శాన్స్క్రిట్ వచ్చినవాళ్ళవల్ల ఎక్కువ డేంజరా అంటేఐడోంటో్న. కొంచెం నాలెడ్జివల్ల డేంజరేగాని సుఖంలేదు.

రచయిత్రులు చూడండి, నిశ్వసిస్తారు కాని నిట్టూర్చి అని వ్రాయరు. ఆర్ద్రనయనాలతో అంటారు — కళ్ళు చెమ్మగిల్లాయి అని వ్రాయరు. అప్రతిభులయారని వ్రాస్తారు. నిశ్చేష్టులయారని వ్రాయరు. తెలియని శాన్‌స్క్రిట్ మాటలు పూహా గుప్పించేస్తూంటారు. తెలుగు మాటలు కాస్త లోకువ. అందుకని వాడరు. శైలి గొప్పగా వుండాలని మరమేకులు పెట్టి బిగించినట్లు, తెలిసే తెలుగుమాటకు బదులు తెలియని సంస్కృతం మాటల్ను గుప్పించి మురిసిపోతూంటారు మన రైటరీ మణులు.

అలాగైతే ఆపాటి శాన్‌స్క్రిట్ నాకూ వచ్చు. ఫామిలీ ప్లానింగ్ తీస్కోండి —

కన్యా రూపవతీ శత్రుః కాని భార్యా రూపవతీ శత్రుః కాదు. భార్యా అరూపవతీ శత్రుః అని మార్చుకోవాలి. భార్యా రూపవతీ మిత్రః అని వాడొచ్చో లేదో (పరిగెట్టుకు రేడియో స్టేషన్‌కి వెళ్ళి జరుక్ శాస్త్రి గారిలాటి వారినడిగి రమ్మంటే అబ్బ కాళ్ళు నొప్పలంటారు మావారు, ఆర్ద్రి నయనాలతో జేబురుమాలలోకి నిశ్వసిస్తు). రూప్ బిగింపులు వచ్చాక రూపవతులు రూపా ముద్రలు ఎక్కువై అంతా రూపాంతరం చెందుతున్నారు.

ఎంత ఛండాలపు రొమాన్సయినా సంస్కృతంలో వ్రాస్తే క్లాసికల్‌గావుంటుంది. అదే శృంగారము తెలుగులో అఘోరిస్తే డర్టీగా నాస్టీగా వుంటుందట,

మొన్నీ మధ్య రేడియోలో కాశ్మీర పట్టమహిషి నాటిక వినాల్సొచ్చింది. నిద్రపట్టక ఉక్కబోస్తుంటే రేడియో తిప్పా. ఆ నాటకంలో పక్కా అమెరికన్‌టైపు కట్‌త్రోట్ బిజినెస్ మాన్ ఉన్నాడు. వాడు వజ్రాల వర్తకుడు. కాశ్మీర్ చక్రవర్తికి పెళ్ళాన్ని అంటగట్టి వజ్రాల వ్యాపారం వృద్ధి చేసుకోవాలని సెకండ్ వైఫ్‌తో కలసి ప్లాన్లు వేస్తుంటాడు.

ఆ మహేంద్ర ప్రభ ఎటువంటి స్త్రీరత్నమంటే, నృత్య సంగీత సాహిత్యాలన్నీ తెలిసిన అసమాన సౌందర్యవతి, సుగుణఖని, ఆభిజాత్యం కలది. తనకు పిల్లలు కలగడం లేదని భర్తకు పునర్వివాహం తనే స్వయంగా చేయించింది. అటువంటి స్త్రీని నెత్తిమీద పెట్టుకోవలసిన వజ్రాల శ్రేష్ఠి, రాజుగారిని మోహించమని పెళ్ళాన్ని వేపుకు తింటాడు. ఇంకానయం మా సిస్టర్ రంగనాయకమ్మగారు ఈ రేడియోనాటిక వింటే రేడియో బ్రద్దలుకొట్టేసుందురు. నాకూ అంత ఆవేశం వచ్చింది. కొంచెం తగ్గాను. మళ్ళీ నాలుగైదొందలు తగలేసి రేడియో కొనుక్కోలేం గదా! ఇంతకీ మహేంద్రప్రభ దేవదాసీత్వం పొందింతరువాత నెమ్మదిగా కాశ్మీర్ చక్రవర్తి వలపు పిలుపును మన్నించి పట్టమహిషి అవుతుంది. అలాంటి భార్యా సమర్పణ చేసే ప్లాటు సంస్కృతంలో వుండబట్టి సరి పోయిందికాని తెలుగులో అలాంటి నాటికవ్రాస్తే రేడియోవారు ప్రసారం చేస్తారా? కథ వ్రాస్తే పత్రికలు వేస్తాయా? ఎటువంటి శృంగారమైనా సంస్కృతంలో చెల్లినట్లు తెలుగులో చెల్లదు.

అప్పుడా సమాజంలో వ్యాపారస్థుడి భార్య అయినప్పటికీ భర్తను వదిలి మరొక పురుషుడ్ని పొంది పట్టమహిషి కాగలిగింది. ఇప్పుడా అడజుస్టుమెంటాలిటీ ఏది? రామారావు పెళ్ళాన్ని తన్ని తగలేస్తే ఏ భీమా రావో కొన్నాళ్ళు చేరదీసినా తిరిగి ఆమె ఏ లాడ్జింగు హోమ్‌కో చేరాల్సిందేకాని, మినిస్టరు సంగతి అలా వుంచండి కనీసం అసెంబ్లీ మెంబరు లేదా, పార్లమెంటు మెంబరు కూడా అవలేదు. ఈ సొసైటీ ఆడదానికి సెక్యూరిటీ యివ్వలేదు. స్త్రీల సమస్య రోజురోజుకి కుప్పుసామయ్యర్ మేడ్ డిఫికల్టు అవుతోంది కాని, వెంకటసుబ్బారావు మేడీజి కావడంలేదు.

అంచేత సంస్కృతంలో— నిశ్వసించడం, అర్ధనిమీలితనయనాలతో చూడడం, ముఖాన్నంతా కాటుక పులుముకొనడం, పాదధూళి నెత్తిమీద జల్లుకోవడం, యీ ముద్దగోంగూర పచ్చడి తినకపోతే నెత్తిబద్దలుకొట్టుకుని చచ్చిపోతాననడం, "యీ వంశం—యీ ఇల్లు—కుటుంబగౌరవం"

అంటూ డొంకటర్నింగ్ డైలాగులుచెప్పి ఫామిలీసెంటిమెంటుని బజార్న అమ్మజూపే రైటర్సంటే నాకు కోపంలేదుగాని చిరాకు.

సంస్కృతంలో బావున్నాయనిపించే పదాలూ, శ్లోకపాదాలూ తెలుగులోఎందుకో బావుండవు. మచ్చుకి — కాంతా కుచాంబురుహ కుట్మలలోల దృష్టే....అస్తమానూ యిదే పనా? అంచాతే తెలుగులో అశ్లీలం మాట్లాడేవాళ్ళని సంస్కృతం మాట్లాడుతున్నారంటారు.

సంస్కృతం నేర్చుకోకపోయినా వచ్చినట్లే వుంటుంది. తెలుగు నేర్చుకున్నారాదు.

అదుగో — మావారొచ్చినట్లున్నారు.

అబ్బ! ఇంత పాదధూళి మోసుకొచ్చారేవిటి చెప్పుల్తో....ముఖ మంతా కాళిమ చేసుకోకండి. వేడ్నీళ్ళు తోడిస్తా —అప్పుడే గాఢంగా నిశ్వసించి అప్రతిఘులై పోకండి. బాత్ రూంలోకి నడవండి. వీపు రుద్దుతాగా.

నీళ్ళోసుగోరూ! ఐతే ఆ పాదధూళితో అలాగే వుంటారన్న మాట! ఐ పిటీ యు.